క్లుప్తంగా

విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ -1912

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్‌చేయాలని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. లేకుంటే ప్రాంతాల వారీగా ఏఈలకు సమస్యను తెలపవచ్చన్నారు. జిల్లాకు వర్ష సూచన ఉండడంతో వినియోగదారులు విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడు నియోజకవర్గాల పరిధిలో ప్రజలు తమ విద్యుత్ సమస్యలు తెలుపడానికి ఏఈల నంబర్లను తెలియజేశారు.

మిట్టూరు సెక్షన్	-	9440811825
గిరింపేట	-	9440811826
సంతపేట	-	9400811890
కొంగారెడ్డిపల్లె	-	9440811827
రూరల్ – 2 సబ్ డివిజన్		
ఆవులకొండ	-	94408 11837
జీడీనెల్లూరు	-	94408 11838
పెనుమూరు	-	94408 11839
పూతలపట్టు	-	94408 11840
పాలసముద్రం	-	94408 11841
రూరల్ – 3 సబ్‌డివిజన్		
కొత్తపల్లె	-	94408 11832
రెడ్డిగుంట	-	94408 11828.
చిత్తూరు రూరల్	-	94408 11829

గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలు పరిష్కరించండి


వినతులు తీసుకుంటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే)లో వచ్చిన సమస్యలను పరిష్కరించి, నివేదిక ఇవ్వాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అరుణ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో ప్రజారోగ్యం, రెవెన్యూ, ఇంజినీరింగ్, మెప్మా విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు వచ్చాయి. వీటిని క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, మునిసిపల్ ఇంజినీరు గోమతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలు


ఎగువ మత్యంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని వైద్యాధికారి మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎగువ మత్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలిచ్చారు. వర్షాకాలంలో జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీరు తాగాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బీపీ, సుగర్‌వాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజామణి, హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నాం


పానాటూరులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్

గుడిపాల: ప్రతి గ్రామంలో సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నామని డాక్టర్ రష్మిత అన్నారు. మండలంలోని పానాటూరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలోనూ వైద్య సేవలు అందించినట్లు వివరించారు. 63 మందికి చికిత్స చేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శాంతకుమారి, ప్రియాంక, శివగామి, భారతి, మునిమేఘల పాల్గొన్నారు.

వేడుకగా 'బలి బండి కూడు'

కార్వేటినగరం : మండల కేంద్రంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం వేడుకగా బలి బండి కూడు కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం ఈ ఘట్టాన్ని భాగవతారిణి రెడ్డెమ్మ హరికథగా వివరించారు. సాయంత్రం భీమ వేషధారి ఎడ్ల బండిపై కూడు తీసుకెళ్లే సన్నివేశాన్ని ప్రదర్శించారు.


బండిపై కూడు తీసుకెళుతున్న భీమ వేషధారి

ప్రజాధనం 'నీళ్ల' పాలు


కార్పొరేషన్ కార్యాలయంలో ఉంచిన వాటర్ బాటిల్స్

- కార్యాలయ ఆవరణలోనే వాటర్ ప్లాంటు
- అయినా వాటర్ బాటిళ్ల కొనుగోలు
- సచివాలయాలకు గుక్కెడు నీళ్లివ్వని వైనం
- నీటి బిల్లుల పేరిట రూ.లక్షల్లో చెల్లింపులు
- చిత్తూరు కార్పొరేషన్‌లో అధికారుల లీలలు

చిత్తూరు అర్బన్: అయిన వాళ్లకు కంచాల్లో అనే సామెతను గుర్తు చేస్తూ.. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో తాగడానికి ఉపయోగించే నీటి నుంచి కొందరు అధికారులు డబ్బులు దండుకుంటున్నారు. ఎవరో కాంట్రాక్టర్‌ను బతికించడానికి ప్రజాధనం దుర్వినియోగం చేస్తూ, అందులోంచి వచ్చే కమీషన్ల కోసం కక్కుర్తిపడుతున్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజారోగ్య, ఇంజినీరింగ్, మెప్మా, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, గణాంక, ప్రధాన కార్యాలయ విభాగాలున్నాయి. వీటన్నింటిలో కలిపి దాదాపు 60 మంది వరకు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీళ్ల తాగడానికి అన్నట్టు, వాటర్ బాటిళ్లను సరఫరా చేసినట్టు బిల్లులు చూపించిన అధికార యంత్రాంగం ఏటా రూ.లక్షల్లో ఖర్చు పెడుతోంది. ఇప్పటికి దాదాపు రూ.10 లక్షల వరకూ ప్రజాధనం వృథా చేసినట్లు సమాచారం. కార్యాలయంలో లోపల ఉన్న ఉచిత శుద్ధి నీటిని అందరూ ఉపయోగించుకుంటే మునిసిపాలిటీపై భారం తగ్గుతుందనే ఆలోచన కూడా చేయని అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు దారిస్తోంది.

సచివాలయాల్లో తీరని దాహం

మరోవైపు కార్పొరేషన్ పరిధిలోని 50 సచివాలయాల్లో సిబ్బందికి, అక్కడకు వచ్చే ప్రజలకు నీరు అందించాల్సిన బాధ్యత కూడా కార్పొరేషన్ అధికారులే చూసుకోవాలి. కానీ దాదాపు ఏడు నెలలుగా సచివాలయాలకు నీళ్లను సరఫరా చేయలేదు. సచివాలయాల్లో పనిచేసే కార్యదర్శులు రోజూ ఇంటి వద్ద నుంచే నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఇక్కడకు వచ్చే ప్రజల దాహం గురించి పట్టించుకునే దిక్కులేకుండాపోయింది. కార్పొరేషన్ కార్యాలయంలో గాడితప్పిన పాలనకు నీటి సరఫరా వ్యవహారం ఓ సాక్ష్యంగా నిలుస్తోంది. ఈ విషయం ఇటీవల కమిషనర్ దృష్టికి వెళ్లడంతో, సచివాలయాలకు నీటి సరఫరా పునరుద్ధరించాలని ఆదేశించారు. ఫలితంగా ఇటీవల నీళ్ల సరఫరా మొదలైంది.

ఇపుడు క్యాన్లలో..

అధికారులకు మాత్రమే సరఫరా అవుతున్న వాటర్ బాటిళ్ల వ్యవహారంపై సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగడంతో కార్పొరేషన్ పరువుపోయింది. దీంతో దిద్దుబాటు చర్యలకు దిగిన అధికారులు, వాటర్ బాటిళ్ల సరఫరా ఇపుడు వద్దని తాత్కాలికంగా ఆపేసినట్లు తెలుస్తోంది. వాటర్ బాటిళ్ల స్థానంలో 20 లీటర్ల పెద్ద క్యాన్లలో నీటిని కొనుగోలు చేయడానికి శ్రీకారం చుట్టారే తప్ప, ఇక్కడున్న శుద్ధినీటి ప్లాంటులో నీళ్లను ఉపయోగించుకుందామని మాత్రం అనుకోవడంలేదు. ఏది ఏం జరిగినా నీళ్ల సరఫరా చేసే వ్యక్తికి లబ్ధి చేకూర్చాలని కొందరు కంకణం కట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారే తప్ప, ప్రజాధనం ఆదా చేద్దామనే ఆలోచన చేయకపోవడం విమర్శలకు దారితీస్తోంది.



ఇక్కడ కనిపిస్తున్నది చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం లోపల ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్. దాదాపు రూ.15 లక్షల విలువచేసే ఈ శుద్ధినీటి ప్లాంటును ఓ స్వచ్ఛంద సంస్థ ఉచితంగా ఏర్పాటు చేసింది. కార్పొరేషన్ కార్యాలయంలోని అధికారులకు, సిబ్బందికి ఎప్పుడు కావాలంటే అప్పుడు 24 గంటల పాటు అందుబాటులో ఉండేలా ప్లాంటును కార్యాలయంలోపలే ఏర్పాటు చేశారు.



ఇవి అర లీటర్ పరిమాణం ఉన్న వాటర్ బాటిల్స్. కార్పొరేషన్ కార్యాలయంలోని కేవలం ఓ పది మంది అధికారులకు మాత్రమే ఇవి అందుబాటులో ఉంటాయి. కింది స్థాయి సిబ్బంది చేతికి ఈ బాటిళ్లు వెళ్లవు. పక్కనున్న ప్లాంటులో ఉచితంగా లభించే శుద్ధినీటిని తాగడం చిన్నతనం అనుకున్నారో. ఏమో..? ఏ ఒక్క అధికారీ ప్లాంటులోని నీళ్లు తాగరు. కేవలం సిబ్బంది, కార్యాలయానికి వచ్చే ప్రజలు మాత్రమే ఈ ఉచిత నీటిని తాగుతున్నారు.

ఆ నీళ్లు కొద్దిగా తేడా..

వాటర్ బాటిళ్ల కొనుగోలు ఇపుడు ఆపేశాం. 20 లీటర్ల క్యాన్లను తెప్పిస్తున్నాం. కౌన్సిల్ సమావేశాలకు మాత్రమే వాటర్ బాటిళ్లను తెప్పిస్తున్నాం. సచివాలయాల్లో నీటి సరఫరా పునరుద్ధరించాం. కార్యాలయంలో ఉన్న ప్లాంటులో వస్తున్న నీటిలో పీహెచ్ విలువ తేడా ఉందని తెలిసింది. దీన్ని బాగుచేయించి, అందరికీ ఇదే నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటాం.

– వెంకటరమణ, డీఈఈ, చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్.

మరో ముగ్గురికి ఆర్ఐ పోస్టులు

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో మరోమారు సిబ్బందిని అంతర్గత బదిలీలు చేస్తూ కమిషనర్ అరుణ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గడచిన 15 రోజుల్లో సిబ్బందికి స్థానచలనం కల్పించడం ఇది మూడోమారు కావడం విశేషం. ఆర్థికంగా బలమైన రెవెన్యూ విభాగంలో ఈసారి అదనంగా ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నియమించారు. ఇందులో ఎం.సురేష్, ఎస్.గోవర్ధన్‌శెట్టి, టి.కోదండన్ ఉన్నారు. గతంలో ఆర్ఐగా నియమించిన దొరైరాజ్, ఆ బాధ్యతలు తీసుకోకపోవడంతో ఆయన్ను సూట్ క్లర్క్‌కే పరిమితం చేశారు. ఇక రెవెన్యూ విభాగంలో గుమస్తా అనీషాను మెప్మా విభాగానికి, మహిళా మార్టులో ఉన్న రాహిత్యను రెవెన్యూ విభాగానికి, గ్యాంగ్ మజ్దూర్‌గా పనిచేస్తున్న లోకేష్, నీలవేణిని గణాంక విభాగానికి, రోడ్‌రోలర్ క్లీనర్ మునిచంద్రను ఇంజనీరింగ్ విభాగానికి బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ


విద్యాసామగ్రి అందజేస్తున్న ఎంఈఓ

తవణంపల్లె: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, షూలు, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి తెలిపారు. మండలంలోని 66 పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాం, బ్యాగులు, షూలు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు అందజేసినట్లు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సుజనకుమారి, సీఆర్‌పీలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంగళ విద్యావాణి సంచిక ఆవిష్కరణ


మంగళవిద్యావాణి సంచికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఉపాధ్యాయులు

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సాయంత్రం ×మంగళవిద్యావాణి× మాస పత్రిక 27 వ సంచికను పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవిష్కరించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ×మంగళ విద్యావాణి మాసపత్రికను నడపడం అభినందనీయమన్నారు. విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయుల బృందాన్ని అభినందించారు. 27వ సంచికకు పాఠశాల సోషియల్ ఉపాధ్యాయుడు ధనశేఖర్ ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, హెచ్‌ఎం రాజ్యలక్ష్మి, సర్పంచ్ మురళి, ఉపాధ్యాయులు అరుణ్‌శివప్రసాద్, రిటైర్డు హెచ్‌ఎం మోహనరామలింగం తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు సాయం


బాధితునికి చెక్కును అందజేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

పూతలపట్టు: టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త నిరంజన్‌కు పార్టీ ఆర్థిక సాయం అందించింది. ఎగువ పాలకూరుకు చెందిన నిరంజన్‌కు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ చిత్తూరులో చెక్కును అందజేశారు. బాధితుడిని పరామర్శించి, కుటుంబానికి పార్టీ అధిష్టానం అండగా ఉంటుందని భరోసానిచ్చారు.

కలెక్టర్‌తో బోయకొండ ఈఓ


కలెక్టర్‌కు తీర్థప్రసాదాలు అందజేస్తున్న ఈఓ

చిత్తూరు కలెక్టరేట్: బోయకొండ గంగమ్మ ఆలయ ఈఓ ఏకాంబరం సోమవారం కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. అనంతరం జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్యను కలిశారు.

రేపటి నుంచే 'ఆడి' ఆరంభం

- తమిళ ఆషాఢమాసంగా ప్రసిద్ధి
- అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- నగరంలో నాగాలమ్మ జాతరకు సిద్ధం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేపటి నుంచే ఆడిమాసం ఆరంభం కానుంది. శుభ ముహూర్తాలకు బ్రేక్ పడనుంది. బుధవారం నుంచి ఆడి (తమిళ ఆషాఢ) మాసం ప్రవేశించడంతో ముహూర్తాలు లేవు. మూడు నెలలుగా జిల్లాలో కొనుగోలుదారులతో కళకళలాడిన పెళ్లి సామగ్రి దుకాణాలు బోసిపోనున్నాయి. పెళ్లి మండపాలు, ప్రింటింగ్, ఈవెంట్ ఆర్గనైజర్లు, వంటవారు, భజాభజంత్రీలు, నాదస్వరం, పురోహితులు నెల రోజుల పాటు వేచి ఉండాల్సిందే. ఇక అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు ప్రారంభం కానున్నాయి. నగరంలో నాగాలమ్మ జాతరకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో ఎక్కువగా తమిళ సంస్కృతీ సంప్రదాయాన్ని అనుసరిస్తారు. ఆడి మాసం ఈ నెల 17వ తేదీ నుంచి మొదలవుతోంది. ఈ మాసంలో వివాహం లాంటి శుభకార్యాలు తలపెట్టరు. ఈ మాసంలో అనేక పర్వదినాలు ఉన్నాయి. ఈ నెలలో వచ్చే ఏకాదశిని తొలి ఏకాదశి అంటారు. అప్పటి నుంచి ప్రతి వారం ఏదో ఒక పండుగ, వ్రతం, పూజ ఉంటాయి. తొలి ఏకాదశి నుంచి వ్రతాన్ని ప్రారంభిస్తారు. ఈ మాసంలో యువతులు గోరింటాకు తప్పక పెట్టుకోవాలని పెద్దలు పేర్కొంటారు. గోరింటాకుకు మన సంప్రదాయంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈ ఆషాఢ పౌర్ణమిని వేదవ్యాసుని పేరిట గురుపౌర్ణమిగా నిర్వహించుకుంటారు.


జాతరలో నాగాలమ్మ (ఫైల్)

వధూవరులు దూరం

ఆడి మాసంలో అత్తాకోడళ్లు ఒక ఇంటిలో ఉండకూడదంటారు. కొత్తగా పెళ్లయిన దంపతులను దూరంగా ఉంచుతారు. ఇందులో భాగంగా అమ్మాయిని పుట్టింటికి తీసుకువెళతారు. ఇందులో శాస్త్రీయత ఉందని పెద్దలు పేర్కొంటున్నారు. ఈ మాసంలో స్త్రీ నెల తప్పితే తొమ్మిది నెలల తర్వాత వేసవి కాలంలో ప్రసవించే అవకాశం ఉందని, అప్పుడు ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండి శిశువుకు ఆ వాతావరణం ఇబ్బంది కలిగిస్తుందంటారు. ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని, తల్లీబిడ్డల ఆరోగ్యానికి కూడా ఈ వాతావరణం మంచిది కాదంటారు. అందుకే ఆ మాసంలో నూతన దంపతులను దూరంగా ఉంచుతారు.

వాతావరణంలో మార్పులు

తమిళ ఆషాఢం మొదలయ్యే నాటికి వర్షాలు కురిసి కొత్త నీరు వస్తుంది. మారుతున్న వాతావరణంలో అనుకూల, ప్రతికూల మార్పులను తట్టుకుని నిలవాలన్నదే ఈ మాసం సందేశం. కొత్త జంటల్లో అమ్మాయి ఈ మాసంలో అత్తగారింట్లో ఉండకూడదన్న సంప్రదాయం బాగా ప్రచారంలో ఉంది. శారీరకంగా, మానసికంగా అప్పుడప్పుడే భర్తకు దగ్గరవుతున్న వారు ఈ ఎడబాటు ద్వారా కలిగే ప్రేమ వారి జీవితానికి ఉపయోగపడుతుందంటారు.

వ్యాపార వర్గాల్లో గుబులు

ఈ ఆడి మాసంతో శుభముహూర్తాలు లేక తమ వ్యాపారాలు పడిపోతాయని వారికి గుబులు పట్టుకుంది. వానాకాలం రైతుల సీజన్ కూడా కావడంతో రైతులు పొలం పనుల్లో ఉండి తమ అవసరాలను వాయిదా వేసుకుంటారని, నిత్యావసరలకే తప్ప అనవసరంగా ఏమి కొనుగోలు చేయరని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జాతర సందడి

ఈ నెలలోనే నగరంలో నాగాలమ్మ జాతరకు కంకణం కడతారు. ప్రతి శుక్రవారం జాతరను నిర్వహిస్తారు. వీధిలో అమ్మవారిని శిరస్సును ప్రతిష్ఠించి జాతర చేయనున్నారు. అమ్మవారికి అంబలి, పుట్టకు పాలు పోసి విశేష పూజలు చేస్తారు. వీధి నాటకాలు, అగ్గి తొక్కే కార్యక్రమం వంటి వాటిని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఇందుకు ఆయా నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

తవణంపల్లె: కురుస్తున్న వర్షం



బంగారుపాళెం: వర్షంలో గొడుగులతో వెళుతున్న విద్యార్థులు



కురిసేను వాన.. మురిసేను రైతన్న

- పంట పొలాలకు జీవకళ
- జన జీవనానికి అంతరాయం
- ఇళ్లకు పరిమితమైన జనం

బంగారుపాళెం: బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి చిరుజల్లులతో కూడిన జడివాన ఆరంభమైంది. సాయంత్రం వరకూ పలు దఫాలుగా పడుతూనే ఉంది. దీంతో వేరుశనగ పంటకు ఊపిరి వచ్చింది. ప్రస్తుతం నియోజకవర్గంలో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరుగా సాగుతున్నాయి. వరి, కూరగాయల పంటలకు జీవకళ వచ్చింది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచిస్తోంది. అయితే మరోవైపు జన జీవనానికి అంతరాయం కలిగింది. రోజంతా జల్లులు జల్లులుగా వర్షం కురుస్తూనే ఉండడంతో జాతీయ రహదారి పక్కన తోపుడు బండ్లు, ఫుట్‌పాత్‌లపై చిరుతిండ్లు అమ్ముకునే చిరు వ్యాపారులు అమ్మకాలు లేక ఇబ్బందులు పడ్డారు. దినసరి కూలీల ఉపాధికి విఘాతం కలిగింది. పనులకు వెళ్లలేక ఇళ్లకే పరిమితమయ్యారు. పూతలపట్టు నియోజకవర్గంలోని బంగారుపాళెం, తవణంపల్లె, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల్లోనూ ఈ జడివాన కురుస్తూనేఉంది. అయితే భారీ వర్షాలు కురిస్తే చెరువులు నిండి భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయి. దీంతోపాటు వ్యవసాయానికి మరింత అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. అడపాదడపా ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయన్నారు.


వర్షానికి కళకళలాడుతున్న పంట

రోడ్లు బురదమయం

తవణంపల్లె: మండలంలోని కురుస్తున్న చిరుజల్లులకు రోడ్లు బురదమయంగా మారాయి. జడివాన కురుస్తుండడంతో సోమవారం ఉదయం జనం బయట తిరగలేక ఇళ్లకే పరిమితమయ్యారు. జడివాన కురవడంతో వేరుశనగ పంట అనుకూలంగా మారింది. కానీ తేమ ఎక్కువైతే పంట దెబ్బతినే అవకాశం ఉంది. చిరుజల్లులతో వ్యవసాయం పనులకు ఆటంకం కలిగించినా చెరువులకు, కుంటలకు చుక్కనీరు చేరలేదు. గ్రామీణ రోడ్లు బురదమయంగా మారడంతో ప్రజల రాకపోకలకు, ద్విచక్ర వాహనాలు తిరగడానికి ఇబ్బందులు పడుతున్నారు.


వర్షంలోనే వెళుతున్న గాజుల వ్యాపారి


తవణంపల్లె: జడివానకు బురదమయంగా మారిన రోడ్డు


బంగారుపాళెం: వర్షంలోనే పశువులను తోలుకెళుతున్న వృద్ధురాలు


ఐరాల: చెరువుకు చేరిన వర్షపునీరు